క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి పోటీలకు గురుకుల విద్యార్థులు



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నర్సాపూర్: సీఎం కప్ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీలకు తమ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని స్థానిక అల్లూరి సీతారామరాజు గిరిజన బాలుర గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్స్ శ్రీనివాస్, రవి తెలిపారు. మెదక్‌లో జరిగిన జిల్లా స్థాయి పోటీలలో ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు. బబ్లు, విష్ణు, సిద్దార్థ్ పలు రకాల అథ్లెటిక్ పోటీలలో ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని వివరించారు. కాగా, విద్యార్థులకు ప్రిన్సిపాల్స్‌తో పాటు ఉపాధ్యాయులు కిషోర్, లక్ష్మణ్, లింగం గౌడ్, రాజులు అభినందించారు.

బ్యాడ్మింటన్‌లో రన్నరప్‌గా కీర్తిశ్రీ



మెడల్స్‌తో కీర్తిశ్రీ

చిలప్‌చెడ్(నర్సాపూర్): మెదక్‌లో నిర్వహించిన సీఎంకప్ జిల్లా స్థాయి అండర్–15 బ్యాడ్మింటన్ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన కీర్తిశ్రీ రన్నరప్‌గా నిలిచింది. చిలప్‌చెడ్ మండలం అజ్జమర్రికి చెందిన వడ్ల కీర్తిశ్రీ చదువుతో పాటు, క్రీడలలో తన ప్రతిభ చాటుకుంది. ప్రస్తుతం మెదక్ మైనార్టీ కళాశాలలో ఇంటర్ చదువుతోంది. చదువు, క్రీడల్లో రాణిస్తున్న కీర్తిశ్రీని మాజీ సర్పంచ్ పరుశరాంరెడ్డి అభినందించారు.


శేరిపల్లిలో సెమీ క్రిస్మస్ వేడుకలు



యేసు పుట్టుక నాటికను ప్రదర్శిస్తున్న చిన్నారులు

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండలం శేరిపల్లిలో స్థానిక ఇండిపెండెంట్ బాప్టిస్ట్ చర్చి ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. చర్చి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో పాస్టర్ రుబేస్ అయ్యవారు దైవసందేశం వినిపించారు. దేవుడిని నమ్ముకొని సన్మార్గంలో నడవాలని కోరారు. ఈ సందర్భంగా క్రిస్మస్ కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించగ.., చిన్నారులు ప్రదర్శించిన క్రీస్తు పుట్టుక నాటిక అలరించింది. నృత్యాలు, కీర్తనలు వినిపించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మల్లేశం, మాజీ ఉపసర్పంచ్ భాగ్యలక్ష్మి, గ్రామనాయకులు చంద్రంగౌడ్, శ్రీనివాస్, యాదగిరి, ఎల్లం, జయరామ్‌గౌడ్, సంఘం సభ్యులు శ్రీనివాస్, శ్రీశైలం పాల్గొన్నారు.


యువకుడికి గాయాలు



చికిత్స పొందుతున్న శ్రీకాంత్

రామాయంపేట(మెదక్): రామాయంపేట బస్టాండ్‌లో శుక్రవారం అక్కన్నపేటకు చెందిన జాల శ్రీకాంత్ గాయపడ్డాడు. హైదరాబాద్ నుంచి నిర్మల్ డిపోబస్సులో వచ్చిన శ్రీకాంత్ రామాయంపేట బస్టాండ్‌లో బస్సు దిగుతున్న క్రమంలో బస్సు ముందు టైరు అతని కుడి కాలుపై నుంచి పోయింది. గాయపడ్డ శ్రీకాంత్‌ను చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న నాయకులు

టేక్మాల్(మెదక్): మండల కేంద్రంలో సీసీ రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. శుక్రవారం స్థానిక గాంధీభవన్ నుంచి మార్కెట్ వరకు పనులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నిమ్మ రమేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి దామోదర ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా రూ.25 లక్షలు మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కిషోర్, సింగిల్ విండో మాజీ డైరెక్టర్ ఆశిలి సాగర్ తదితరులు పాల్గొన్నారు.

పై చదువులకు దూరం!

- రేగోడ్‌లో డిగ్రీ కళాశాల కరువు
- ఇబ్బంది పడుతున్న విద్యార్థులు
- పెరుగుతున్న డ్రాపౌట్లు



మోడల్ స్కూల్‌లో ఇంటర్ విద్యార్థులు

రేగోడ్(మెదక్): ప్రతీ ఒక్కరూ చదువుకోవాలని ప్రభుత్వం చెబుతున్నా అందుకనుగుణంగా సౌకర్యాలు కల్పించడంలో విఫలం అవుతున్నారు. మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల లేకపోవడంతో డ్రాపౌట్లు పెరుగుతున్నాయి. పై చదువులు కలగానే మిగిలిపోతున్నాయని నిరుపేద విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రమైన రేగోడ్‌లో 2013లో అప్పటి మంత్రి దామోదర రాజనర్సింహ రూ. 3 కోట్లతో మోడల్ స్కూల్ ఏర్పాటు చేశారు. అందులో 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు తరగతులు కొనసాగుతుండగా, 691 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఏటా పదిలో ఉత్తమ ఫలితాలతో పాటు ట్రిపుల్ ఐటీలో సైతం సీట్లు సంపాదిస్తున్నారు. ఇంత వరకు బాగానే ఉన్నా ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు డిగ్రీ చదివేందుకు స్థానికంగా డిగ్రీ కళాశాల లేదు. నారాయణఖేడ్, పెద్దశంకరంపేట, జోగిపేట వంటి పట్టణాలకు వెళ్లాల్సి వస్తోంది. సమయానికి బస్సు సర్వీసులు లేకపోవడంతో పాటు నిరుపేద విద్యార్థులు చాలా మంది చదువును మధ్యలోనే ఆపేస్తున్నారు. మరికొంత మంది బాలికలు ఇంటి.. వ్యవసాయ పనికి వెళ్తున్నారు. అయితే రేగోడ్‌లో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని చాలా కాలంగా డిమాండ్ ఉంది. కానీ గత పాలకులు విద్యా వ్యవస్థపై చిన్న చూపు చూడడంతో కలగానే మిగిలిపోతోంది. అప్పట్లో మోడల్ స్కూల్, కేజీబీవీతో పాటు విద్యాభివృద్ధికి కృషి చేసిన మంత్రి దామోదర రాజనర్సింహ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు సైతం చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఇబ్బందిగా మారింది



రేగోడ్‌లో ఇప్పటివరకు డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయలేదు. ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు డిగ్రీ కళాశాలలో చదువుకునే అవకాశం ఉంది. ఇక్కడ కళాశాల లేకపోవడంతో దూర ప్రాంతాలకు వెళ్లాలంటే ఇబ్బందిగా మారింది.

– రాధిక, ఇంటర్ రెండో సంవత్సరం

విద్యార్థులకు తీరని నష్టం



మండలంలో విద్యా వ్యవస్థ అవ్యవస్తంగా మారింది. ఉపాధ్యాయుల కొరతతో పాటు కావాల్సిన సౌకర్యాలను కల్పించడం లేదు. ఇంటర్ చదివిన పిల్లలు డిగ్రీ చదివేందుకు ఇక్కడ కళాశాల లేక అనేక ఇబ్బందులు పడుతున్నారు. చాలా మంది చదువు మానేస్తున్నారు. దూర ప్రాంతాలకు తమ పిల్లలను పంపలేక బాలికలకు పెళ్లి చేస్తున్నారు. దీంతో వారు పై చదువులకు దూరమవుతున్నారు.

– చంద్రయ్య, యువజన సంఘం నాయకుడు

ఆటో డ్రైవర్ల ముందస్తు అరెస్టు

తమ సమస్యల పరిష్కారం కోసం ఆటో డ్రైవర్లు శుక్రవారం అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చారు. అయితే.. పోలీసులు వారిని కట్టడి చేశారు. జిల్లాలో పలుచోట్ల ఆటో డ్రైవర్లను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం సొంత పూచికత్తుపై విడుదల చేశారు.



శివ్వంపేటలో పీఎస్ ఎదుట ఆటో డ్రైవర్లు



కౌడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో



మనోహరాబాద్‌లో..



నిజాంపేటలో..



చిన్నశంకరంపేటలో..



అల్లాదుర్గంలో..



చిలప్‌చెడ్‌లో ..



కొల్చారంలో..

శ్రీనిధి రుణాలు రికవరీ చేయాలి

- ఏపీడీ సరస్వతి



వీఓఏల సమీక్షిస్తున్న సరస్వతి

అల్లాదుర్గం(మెదక్): పెండింగ్‌లో ఉన్న శ్రీనిధి రుణాలు వెంటనే రికవరీ చేయాలని ఏపీడీ సరస్వతి అన్నారు. శుక్రవారం అల్లాదుర్గం ఐకేపీ కార్యాలయంలో పెద్దశంకరంపేట, రేగోడ్, టేక్మాల్, అల్లాదుర్గం గ్రామాలకు చెందిన వీఓఏలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బ్యాంకు లింకేజీ రుణాల లక్ష్యం పూర్తి చేయాలని ఆదేశించారు. వీఓఏలు, సీసీలు శ్రీనిధి రుణాల రికవరీలో ఆలసత్వం వహించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విధులు సక్రమంగా నిర్వర్తించకపోతే చర్యలు తప్పవని చెప్పారు. డిసెంబర్ నెలాఖరులోగా 2024–25 సంవత్సరం బ్యాంకు లింకేజీ టార్గెట్ పూర్తి చేయాలన్నారు. సమావేశంలో డీపీఎం వెంకటేశ్వర్లు, ఏపీఎంలు నాగరాజు, గోపాల్ , సంగీత, రామకృష్ణ, నాలుగు మండలాలకు చెందిన కమ్యూనిటీ కోఆర్డినేటర్లు, వీవోఏలు పాల్గొన్నారు.

వర్గీకరణను అడ్డుకోవడం అవివేకమే : ఎమ్మార్పీఎస్



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు యాదగిరి

శివ్వంపేట(నర్సాపూర్): ఎస్సీ వర్గీకరణను అడ్డుకుంటామని చెప్పడం వారి అవివేకానికి నిదర్శనమని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చెట్లపల్లి యాదగిరిమాదిగ తెలిపారు. శుక్రవారం మండలంలోని కొంతాన్‌పల్లిలో గ్రామ కమిటీని నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 59 ఉపకులాలకు సమన్యాయం చేసేందుకే సుప్రీంకోర్టు వర్గీకరణ ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. ప్రభుత్వ వర్గీకరణను త్వరగా చేపట్టాలని కోరారు.

మెరుగైన ఫలితాలు సాధించాలి

- మండల విద్యాధికారి యాదగిరి



విద్యార్థులతో మాట్లాడుతున్న యాదగిరి

నిజాంపేట(మెదక్): పదో తరగతి విద్యార్థులు ఇష్టంతో చదివి మంచి ఫలితాలు సాధించాలని నిజాంపేట మండల విద్యాధికారి యాదగిరి కోరారు. శుక్రవారం రాంపూర్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. పరీక్షలకు సిద్ధంగా ఉండాలని ఆయన విద్యార్థులకు సూచించారు. అలాగే.. మధ్యాహ్న భోజనం పరిశీలించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పద్మారెడ్డి, ఉపాధ్యాయులు ఈశ్వరయ్య, అర్జున్, సుకన్య, నరేష్, చంద్రకాంత్, కుమారస్వామి, షాదుల్ పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ జాతర



ఫలహారం బండిని ఊరేగిస్తున్న గ్రామస్తులు

నర్సాపూర్ రూరల్: మండలంలోని లింగాపూర్‌లో శుక్రవారం పోచమ్మ జాతర ఘనంగా ప్రారంభమైంది. ఉదయం అమ్మవారికి అభిషేకంతో పాటు అలంకరణ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. లింగాపూర్‌తోపాటు పరిసర గ్రామాల భక్తులు తరలివచ్చి అమ్మవారికి ఒడిబియ్యం, బట్టలు, తదితర మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం బండ్లు బోనాలు, ఫలహారం బండిని ఊరేగించారు. బ్యాండ్ మేళాలకు తగ్గట్టు శివసత్తులు, యువకులు నత్యాలు చేశారు.

పకడ్బందీగా 'ఇందిరమ్మ' సర్వే

దుబ్బాకటౌన్: ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకోవడానికి దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఎంపికలో నిష్పక్షపాతంగా ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నామని రాయపోల్ ఎంపీడీఓ బాలయ్య అన్నారు. శుక్రవారం రాయపోల్ మండలం బేగంపేట గ్రామంలో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే పర్యవేక్షించారు.

అమిత్ షా వ్యాఖ్యలపై నిరసనలు

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్‌పై కేంద్రమంత్రి అమిత్ షా చేసిన అనుచిత వ్యాఖ్యలకు దళిత, అంబేద్కర్ యుజన సంఘాలు భగ్గుమన్నాయి. శుక్రవారం జిల్లావ్యాప్తంగా.. నేతలు రాస్తారోకోలు, ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా షా దిష్టిబొమ్మలను దహనం చేశారు. అంబేద్కర్‌పై చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. బేషరతుగా క్షమాపణలు చెప్పాలన్నారు. పలుచోట్ల రాజ్యాంగ నిర్మాత విగ్రహానికి క్షీరాభిషేకాలను నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

– సాక్షి, నెట్‌వర్క్



పాపన్నపేట(మెదక్): అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేస్తున్న యువజన సంఘం సభ్యులు



చిలప్‌చెడ్(నర్సాపూర్): చిట్కుల్‌లో..



వెల్దుర్తి(తూప్రాన్): మాసాయిపేటలో..

ఉపాధ్యాయుల డిప్యుటేషన్‌పై ఆందోళన



ఆందోళన చేస్తున్న విద్యార్థులు

శివ్వంపేట(నర్సాపూర్): తమ ఉపాధ్యాయులను డిప్యుటేషన్‌పై ఇతర పాఠశాలలకు పంపవద్దని మండలంలోని కొంతాన్‌పల్లిలో విద్యార్థులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న తెలుగు, ఇంగ్లీష్ ఉపాధ్యాయులు వెంకటేశం, నాగరాజులను డిప్యుటేషన్‌పై అధికారులు ఇతర పాఠశాలలకు పంపించారు. ఈ విషయమై హెచ్‌ఎం సునందను వివరణ కోరగా విద్యార్థుల సంఖ్య కన్నా అదనంగా ఉన్న టీచర్లను డీఈఓ ఇతర పాఠశాలలకు డిప్యుటేషన్‌పై పంపించారని తెలిపారు.

ఆత్మహత్య చేసుకుంటా..

- రైలుపైకెక్కి వ్యక్తి హల్‌చల్



చేగుంట(తూప్రాన్): ఆగిఉన్న గూడ్స్‌రైలుపైకెక్కి ఆత్మహత్య చేసుకుంటానని ఓ వ్యక్తి హల్‌చల్ చేసిన ఘటన మండలంలోని వడియారం రైల్వే స్టేషన్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. వడియారం రైల్వేస్టేషన్‌లో ఓ ట్యాంకర్ గూడ్స్‌రైలు నిలిచి ఉంది. ఓ వ్యక్తి ఆ గూడ్స్‌రైలు పైకెక్కి అక్కడ్నుంచి హైటెన్షన్ విద్యుత్‌తీగలు పట్టుకుని చనిపోతానని బెదిరిస్తూ అరుపులువేశాడు. ఇది గమనించిన స్టేషన్‌లోని ప్రయాణికులు స్టేషన్ సిబ్బందికి సమాచారం అందించగాపాయింట్‌మెన్ దేవేందర్ రైలు వద్దకు చేరుకున్నాడు. మెల్లగా సదరు వ్యక్తిని సముదాయిస్తూ రైలు పైనుంచి కిందికి దింపాడు. కాగా, హల్‌చల్ చేసిన వ్యక్తి జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన ముఖేశ్‌గా గుర్తించారు. అతడికి కౌన్సెలింగ్ నిర్వహించి సికింద్రాబాద్ వైపు వెళ్తున్న ప్యాసింజర్ రైలు ఎక్కించారు.

తోటి విద్యార్థులకు చేయూత



జామెట్రిక్ బాక్స్‌లను చూపుతున్న విద్యార్థులు

మనోహరాబాద్(తూప్రాన్): పాఠశాలలో నిర్వహించిన మాక్ పోలింగ్‌లో తనను స్కూల్ హెడ్‌గా గెలిపించినందుకు ఓ విద్యార్థిని తోటి మిత్రులకు జామెట్రిక్ బాక్స్‌లను శుక్రవారం అందజేశారు. వివరాల్లోకి వెళ్తే.. మనోహరాబాద్ ఉన్నత పాఠశాలకు చెందిన పదవ తరగతి విద్యార్థి అక్షరకు ఎన్నికల సందర్భంగా అందరూ ఓటు వేసి ప్రధాన మంత్రిగా గెలిపించారు. ఈ సందర్భంగా వారికి ఇచ్చిన మాట ప్రకారం బాక్స్‌లు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం కృపాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ పుస్తె మట్టెలు అందజేత

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని మానెపల్లికి చెందిన బ్యాగరి యాదమ్మ, చంద్రయ్య దంపతుల కూతురు రాణి వివాహానికి కాంగ్రెస్ నేత నరేందర్ రెడ్డి పుస్తె మట్టెలు అందజేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, స్వామి, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

◆ పని చేయని ట్యాపులు

రేగోడ్(మెదక్): మండల కేంద్రమైన రేగోడ్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మన ఊరు – మన బడిలో కార్యక్రమంలో భాగంగా నల్లా ట్యాపులను బిగించారు. కానీ అవి పని చేయకపోవడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. నాసిరకం పనులు చేసినా అడిగే నాథుడు లేరని స్థానికులు మండిపడుతున్నారు. ఈ విషయమై స్థానిక ఎంఈఓ గురునాథ్‌ని వివరణ కోరగా.. త్వరలో మరమ్మతు చేస్తామన్నారు.

◆ నేడు మహమ్మద్‌నగర్‌లో బాలమేళ

కౌడిపల్లి(నర్సాపూర్): ఈనెల 21న మండలంలోని మహమ్మద్‌నగర్ రైతు వేదికలో మండల స్థాయి బాలమేళ నిర్వహించనున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు లక్ష్మి, ఖమర్‌సుల్తాన తెలిపారు. బాలమేళలో అంగన్‌వాడీ కేంద్రాలలో నిర్వహించే కార్యక్రమాలు బాలల సృజనాత్మకత అంశాలను ప్రజల తెలియచేస్తామన్నారు.

◆ రాష్ట్ర పోటీలకు క్రీడాకారుల ఎంపిక

నర్సాపూర్: రాష్ట్ర స్థాయి కిక్ బాక్సింగ్, ఉషూ పోటీలలో పాల్గొనేందుకు జిల్లా జట్లను ఎంపిక చేశామని పీడీలు ఆంజనేయులు, శ్రీకాంత్, పూర్ణచందర్ తెలిపారు. జిల్లా స్థాయి పోటీలలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశామని, కిక్ బాక్సింగ్ నుంచి బాలుర విభాగంలో 9మందిని, బాలికల విభాగంలో 9మందిని ఎంపిక చేసినట్లు వారు చెప్పారు. ఉషూ సబ్ జూనియర్ విభాగంలో 12మంది బాలురు, బాలికలను సమంగా ఎంపిక చేసినట్లు తెలిపారు. కాగా పోటీలలో ప్రథమ ద్వితీయ స్థానాలు దక్కించుకున్న క్రీడాకారులకు మెడల్స్ అందచేసినట్లు వివరించారు.

◆ అంబేద్కర్‌పై కాంగ్రెస్ కపట ప్రేమ

నర్సాపూర్: కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పై కపట ప్రేమ కనబరుస్తుందని బీజేపి యువమోర్చా జిల్లా కార్యదర్శి అనిల్ విమర్శించారు. అంబేద్కర్‌కు వారసులమని చెప్పుకునే ఆ పార్టీ నాయకులు రెండు సార్లు ఆయనను ప్రత్యక్ష ఎన్నికలలో ఓడించారని గుర్తు చేశారు. అంబేద్కర్‌ను రాజకీయాలకు వాడుకోవడం తగదన్నారు.

◆ కొనసాగుతున్న 'ఇందిరమ్మ' సర్వే

నర్సాపూర్: మున్సిపాలిటీలోని అన్ని వార్డులలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే కొనసాగుతోందని కమిషనర్ రామకృష్ణారావు తెలిపారు. సర్వేకు వచ్చే అధికారులకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. కాగా ఐదో వార్డులో 232 ఇళ్లు ఉన్నాయని, వాటిలో 176 ఇళ్ల సర్వే పూర్తయిందని, మిగిలిన 56 ఇళ్ల సర్వే త్వరలో పూర్తి చేస్తామన్నారు.

◆ భుజిరంపేట కాంగ్రెస్ అధ్యక్షుడిగా గోపాల్

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని భుజిరంపేట కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా గోపాల్‌ను ఎన్నుకున్నారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సిద్దిరాంరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎండీ గౌస్, ఉపాధ్యక్షుడిగా బోరంచ, సంయుక్త కార్యదర్శిగా మధు, యూత్ అధ్యక్షునిగా శ్రీకాంత్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా దుర్గేష్, ప్రధాన కార్యదర్శిగా సాయికుమార్, ఉపాధ్యక్షునిగా దుర్గాప్రసాద్, సంయుక్త కార్యదర్శిగా సాయి కుమార్‌లను ఎన్నుకున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసరావు తెలిపారు.

◆ మంజీరాలో ట్రెడిషనల్ డే

రామాయంపేట(మెదక్): మంజీరా విద్యాలయంలో శుక్రవారం సాంప్రదాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. చిన్నారులు దోవతులు, చీరలు ధరించి ఆకట్టుకున్నారు.

◆ ఏఎన్‌ఎంకు సన్మానం

తూప్రాన్: తూప్రాన్ నుంచి చేగుంట పీహెచ్‌సీకి బదిలీపై వెళుతున్న ఏఎన్‌ఎంకు గ్రామస్తులు శుక్రవారం వీడ్కోలు పలికారు. తూప్రాన్ మండలంలోని అల్లాపూర్, రావెల్లి, లింగారెడ్డిపేట, ఘనపూర్ గ్రామాల్లో ఆరేళ్లుగా వైద్య సేవలు అందించి గ్రామస్తులతో కలివిడిగా కలిసి ఉన్న ఏఎన్‌ఎం నాగమణి చేగుంటకు బదిలీ అయ్యారు. శుక్రవారం రావెల్లి గ్రామంలో వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసి ఘనంగా సన్మానించారు. ఆమె ప్రజలకు అందించిన సేవలను కొనియడారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు భగవన్‌రెడ్డి, రాజు, నాయకులు పెంటాగౌడ్, సత్యనారాయణగౌడ్ పాల్గొన్నారు.

◆ ఎకరాకు రూ.లక్ష ఆదాయానికి అవకాశం

తొగుట(దుబ్బాక): ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులను ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సాహిస్తోందని మండల వ్యవసాయాధికారి మోహన్ తెలిపారు.